మీదా ఆధారపడి ఉండటంలో తప్పేమీలేదు. చదివితేనే అత్యద్భుతమైన చిత్రంగా స్క్రిప్టు స్ఫురించాలనుకోవటంలో అర్థంలేదు (కాని చాలా మంది నిర్మాతలు సహజంగా అటువంటి అపోహకు గురిఅవుతున్నట్టు కనిపిస్తుంది.) చదివితేనే ప్రదర్శనం చూసిన ఆనందాన్ని చేకూర్చే నాటక మంటూ ఎక్కడా ఉండదు. సినిమాకథ అయినా అంతే. నాటకాలాడించటంలో ప్రావీణ్యం కల వాడు నాటకాన్ని చదివి అది ఎంత మంచి ప్రదర్శనానికి అవకాశాలిస్తుందో ఊహించగలడు. ఆదేవిధంగా మంచి స్క్రిప్టుచూసి దాని ఆధారంతో ఎటువంటి చిత్రం తీయవచ్చునో ప్రావీణ్యంగల డైరెక్టరు అంచనా వెయ్యగలుగుతాడు. మంచికథ తీసుకుని దాన్ని సంభాషణల రూపంలో తిరగరాస్తే అది మంచి నాటక మవుతుందని ఎక్కడాలేదు. విమర్శకుడైనవాడికి అటువంటి "నాటకంలోనుంచి "కథ" కనిపిస్తూనేఉంటుంది. అట్లాగే సినిమాచిత్రం రూపంలోకి వచ్చినంత మాత్రంచేత ప్రతికథా సినిమాకథ అనిపించుకోదు. సరిఅయిన సినిమాకథలు రావాలి.

---

స్కెచ్

# ఆవేశం

"స్వర్ణ"

శారద కాపరానికి కొచ్చి రెండో సంవత్సరం.

సంజీవరావు ఫోటో తెప్పించుకుని చూచి మరీ పెళ్ళాడింది. అతని నిటారు ముక్కు వెడల్పాటి నుదురు తనని ప్రత్యేకంగా ఆకర్షించేయి. పైగా విద్యావంతుడు బి. ఎ. బి. యల్. ఆస్థి లేక పోతేనేం, అతని బుద్ధే పది లక్షలు. అందరికీ నచ్చింది. తనకీ నచ్చింది సంబంధం. కాని కొంచెం మథన పడకుండా ఉండలేకపోయింది. తను చూస్తే డి. యమ్. ఓ. గారి కూతురు. మరి క్రిందికి దిగి గుమాస్తాగారి అబ్బాయిని చేసుకోడం హీనంగా ఉంటుంది కదా అని. గుమాస్తా కొడుకు గుమాస్తా కాదు గదా! అనుమానంగానే పెళ్ళాడింది.

సంజీవరావు గుమాస్తా అయ్యేడు. అవక తీరలేదు. పాపం తనూ అనుకున్నాడు చదువుకునే రోజుల్లో, చిన్న కలెక్టరును కాక మానతానా అని. కొంత కాలం వేచి చూచేడు, పోగా ఉద్యోగాలకోసం. కాని అవేవీ తనని వరించలేదు. ఎంతకాలం ఇంట్లో కూర్చునేది? పేరు వెనక నాలు గక్షరాల డిగ్రీలు కూడా ఉంచుకుని. నాన్నకు పెన్షను యిచ్చేశారు. అంతా సొంత ఊరుచేరి గడుపుదామని నిశ్చయించేరు పట్నంలో పడి అప్పులతో బ్రతుకుకంటె గుమాస్తాగా చేరితేనేం మంచి రోజులు రాపోతాయా అని స్థిమిత పడి గుమాస్తా అయ్యేడు.

శారదకు దొర్లుతున్న రోజులన్నీ చెడ్డగానే ఉన్నాయి. అసంతృప్తి విషసర్పంలా వెన్నాడుతూనే ఉంది. ఉన్న ఇద్దరు మొగుడూ పెళ్లాలికి పై ఖర్చుకు సరిపోని జీతం, అందులోనే వెనక వాళ్ళకు పంపాల్సి ఉంది. అంతా ఒడ్డునపడ్డ చేప బ్రతుకులా ఉంది. అప్పులనే కొత్త బాధ తనని అంటుకుంది. అదొక నరకంలా ఉంది. ఎన్ని విధాల ఆలోచించినా తన బాధకు సంతృప్తి కనిపించడం లేదు. నాన్నదగ్గర్నే ఉండిపోతేనో! ఛీ! అక్కయ్య మొగుళ్ళందరూ కార్లమీద తిరిగే ఉద్యోగస్తులు. ఫలాని గుమాస్తాగారి పెళ్ళాం బ్రతకలేక అమ్మగారింట కూర్చుందని ఎవరైనా అనుకుంటే ఎంత బాధ. అయినా ఒక సారి ఉచ్చులో పడినతరవాత నరకమయినా అనుభవించాల్సిందే కద! ఏ ఆశ కూర్చుకున్నా ఏదో బాధే చూపిస్తుంది గమ్యం. ఇక బ్రతుకు బరువని ప్రతి క్షణం ఘోష పెడుతుంది. ఇది శరీరానికి పట్టిన రోగమయింది. తరవాత తరవాత ఏదో అవుతానని బుజ్జగించిన సంజీవరావుమాటలు శారద కేకోశానా సంతోషం కల్పించ లేదు.

రోజూ చక్రంలా పనిచేస్తున్న సంజీవరావుకి బ్రతుకు వెగటుగా తోచింది. తొందరలో ప్రమోషన్ రాడానికి కష్టపడి పని చేయాలని ఉలిక్కిపడి కాగితాల్లో దూకుతాడు. పోనీ సినిమాకు వెళ్ళాలంటే అనుకున్న వారం రోజులక్కాని కుదరదు. స్థిమితంగా మాట్లాడడానికి నోచుకోలేనట్టు బాధ పడుతుంది. సంజీవరావు మాట్లాడినా పరధ్యానంగా ముక్తసరిగా మాట్లాడ్డాని కలవాటు పడిపోయేడు. అతను పిచ్చివాడివలె కాగితాల్లో కూచుని పనిచేస్తుంటే ఒకొక్కప్పుడు జాలిపడుతుంది. తన్నొక ప్రక్క కొరుకుతున్న బాధకు సమాధానం చెప్పేవాళ్ళెవరూ?

పోరుపెట్టిన బేబీని ఓదార్చి ఎప్పుడు నిదిరించిందో తనకే గుర్తులేదు. ఫైలు టేబులుమీద ఉంచి పిల్లిలా లోపలికి నడిచిన సంజీవరావు రాక తనకేం గుర్తు? ముసుక్కున్నాడు సంజీవరావు- "మొద్దులా ఇదేం నిద్ర, మనిషివస్తాడని తెలిసుండి కూడా..." శారదకు నిద్రట్లో కొట్టినట్టనిపించింది. రాత్రి పదీ అయింతరవాత నిద్ర పోకపోతే ఎలా? అప్పటివరకూ పాప పోరు భరించలేకపోయింది. గోరుచుట్టుమీద రోకటిపోటులా ఉంది. భర్తయినా మనిషిగా ప్రవర్తించడం లేదని ఉసూరుమంది ప్రాణం. ఊడిగానికి ఇంటి పనిమనిషినా చివరకి అని దుఃఖం కక్కుతుంది. తనూ లేచింది, బేబీ బావురుమంది. గోల వినిపించుకోకుండా వంటగదిలోకి నడిచింది. తేరుకున్న కళ్ళతో చూచింది. సంజీవరావు రాక్షసుడిలా భయంకరంగా ఉన్నాడు. వాడిపోయి క్రూరంగా ముడతలు పడుతున్న ముఖం, ఎర్రటి కళ్ళు చీదరించుకున్నట్టు చూచింది. రోజురోజుకు తనంత భయపడాల్సిన అవసర మేమొచ్చింది ఏమిటీ వింత పరిస్థితులు. ఈ పెడాకులు పేలాలు కాకుండా ఉంటే హాయిగా యింట్లోనే కూచుని ఉందును నాన్నతో, అమ్మతో, అక్కయ్యలతో కబుర్లు చెప్పుకుంటూ? మనస్సు పరి పరి విధాల పోయింది.

భోజనం ముగించిన తరువాత పడకగదిలోకి నడిచింది. సంజీవరావు సిగరెట్టు వెలిగించి ఫైలు తెరిచేడు. ఏదో సమస్యలతో ఢీకొంటూ సిగరెట్టు దమ్ము గట్టిగా లాగుతూ మెదణ్ణి కరిగించి ఏదో వ్రాస్తున్నాడు. అతని ధోరణి ఆమెకు నచ్చలేదు. దీపంచుట్టూ కొట్టుకుంటున్న వెర్రి పురుగులా కనిపించేడు అతను.

బేబీ ఏడుపు ప్రారంభించింది అర్థరాత్రి. అతని రాచకార్యం భేదించిందని చీదరించుకున్నాడు. ఆవిడ ఉక్రోషం వెడల గ్రక్కింది. అతనూ ఉద్రేకం ఆపుకోలేక పశుబలం చూపించేడు. ఆవిడ ఏడ్చింది. చివరకు అతనూ ఏడ్చేడు. ఉద్రేకపుటంచులు దాటి ఆవిడ ఆలోచించింది. అతనూ చిన్నపిల్లవాడిలా బెక్కేడు. నీరసమైపోయి. ఇద్దరూ క్రూరమైన నరకంలో నిద్రపోయేరా రాత్రంతా.

* * *

"అయ్యో! అయ్యో!"అని భయంగా దుఃఖించేరు. ఒకళ్ళూ ఏం చెయ్యలేక ఏడుపు ముఖాలు-పెట్టి భయంగా చూస్తున్నారుఏం చేసేది?

సంజీవరావుకు దుడుకుతనం హెచ్చింది. "శారదా, శారదా" తలుపు కాళ్ళతో చేతులతో తన్నుతున్నాడు,పిచ్చివాళ్లాగ అరుస్తూ. పొరుగింటి విశాలాక్షి "అయ్యో చూస్తూ కూచుంటారే?" అంటూ గుండెలు బాదుకుంది. బేబీని గుండెల్లోకి హత్తుకొని విశాలాక్షి ఇంటికి పరుగెత్తింది. ధర్మారావు ఇంకా భోజనం చేస్తున్నాడు.

"అయ్యో... తొందరగా... రండి...ఇంకేముంది..." అంటూ విషయం చెప్పకుండానే కాలు కాలిన పిల్లిలా వెనక్కి పరుగెత్తింది. భోజనం చేస్తున్న ధర్మారావు గుండె గొంతుకలోకి వచ్చింది. కళ్ళు పెద్ద వయ్యేయి. ఆ పాటికి బలవంతంగా గుటక వేసి చేయి తొలుసుకొని తొందరగా పరుగెత్తేడు.

జనం బాగా గుంపు చేరేను. సంజీవరావు గొంతు హీనమై పోయింది. పోతున్న ప్రాణంలా తేలిపోయేడు. కిటికీ ఊచల్లోంచి చేతులు దూర్చి ఎన్నో విధాల జాలిగా అరుస్తున్నాడు. శారద అతన్ని పెడచెవిని పెట్టింది. నిశ్చలంగా నిలబడి మరణం అనుభవిస్తుంది. ఎంత సాహసం! అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. గుండె దహిస్తూంది. మంటలు చూస్తుంటే.

గునపాలతో వంటగదితలుపులు పెళ్లగించేరు. తొందరగా ఎత్తుగా పెరిగిపోతున్న మంటల్లో శారద లేదు. సంజీవరావు కళ్లు ఎర్రయ్యాయి, ఎర్రటి మంటల్లో కలిసిపోతున్న శారదను చూస్తుంటే. శారదహీనంగామూలుగుతుంది. ఎందుకీసాహసం! స్మృతితప్పి క్రిందపడి కాలిపోతూంది. విశాలాక్షి "శారదా!" అని ఏడుస్తూ అరుస్తుంది. ఆమె ఎవరి వైపూ చూడ్డంలేదేం కర్మం! నొసలు ముడుచుకుంటూ మూలుగుతూమరణాన్ని ఆహ్వానిస్తూంది.

తలుపులు దబ్బున ఊడేయి. సంజీవరావు తూలిపోయి పరుగెత్తేడు, శారదదగ్గిరికి. మంటల్లో శారదను ముట్టుకోలేకపోయేడు. మంటలు మింగేయాలని శారదను చేతులతో తడుముతూ కంగారుగా మంటలు ఆర్పుతున్నాడు. మంటలు ఆరేయి. ఆరిపోతున్న ఆశలతో శారదను బయటకు తీసుకు వచ్చేడు. ధర్మారావు బండి ఇంటిముందు నిలిపి ఆసుపత్రికి తొందర చేసేడు.

శారద చూపుకోసం సంజీవరావు ఆత్రుత పడ్డాడు; గావుకేక వేసేడు. శారదచూడలేదు. ప్రాణం ఉంది. శారద బ్రతకాలి ఎలాగైనా అని డాక్టరు కాలిమీద పడి బ్రతిమాలుకున్నాడు వెర్రిగా.

ఆమె కొద్దిక్షణాల్లో కొరడుబారింది. సంజీవరావు నరకంలో పడ్డట్టనిపించింది. దారితెలియని గుడ్డివాడిలా దిక్కులు చూస్తూ కొరడు బారి పోయేడు. ధర్మారావు డ్రెస్సింగ్ రూంలోకి తీసుకెళ్ళేడు. సంజీవరావు చేతులు కాలి పుండ్లు పడ్డాయి. కట్లుగట్టుకున్నా శవంలా నిలబడ్డాడు అచేతనంగా.

గుంపులోనుంచి రాయి పడింది— "మగాడట మగాడు. చదువుకున్న వాడుకూడాను, చావబాదితే ఏంచేస్తుంది. పసువనుకున్నాడేమో ఆడదంటే.." సంజీవరావు నరాలు పట్టి లాగినట్టనిపించింది. అందర్నీ పిచ్చివాళ్ళాగ శూన్యంగా చూసేడు. అందరూ అతనిమీద కళ్లుతిప్పేరు. ఖూనీకోరుని చూచినట్టుగా ఉంది. బేడీలుపడినట్టు తన చేతికట్లు మరీ విచిత్రంగా నిందిస్తున్నాయి అతన్ని. కట్లు నోటితో పీకేయాలనిపించింది. చచ్చిన శారదను చీల్చేయాలనిపించింది. నేనేం చేయమన్నాను? చావమన్నానా? శరీరం కంపించింది. అందరూ తనవైపు గురిపెట్టిన తూటాల్లా చూస్తున్నారు. అందర్నీ మింగుదామనిపించింది. కాని, విశాలాక్షి ఒడిలో ముడిగిపోయి చిట్టికళ్ళతో మినుకుమినుకు మని చూస్తూన్న బేబీని చూడ్డంతో భూమిలోకి క్రుంగిపోయేడు. కళ్ళల్లోంచి వేడికన్నీరు ప్రవహించింది.

★



హాలీవుడ్ వార్నర్ బ్రదర్స్‌వారు తయారుచేసిన సినిమాస్కోప్ చిత్రం "టాలిస్‌మన్"లో ఒక సన్నివేశం.